సాక్షి అనకాపల్లి

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



దొరికినంతా దోచేస్తాం.!

కొందరు కూటమి నేతలు దొరికినంతా దోచేస్తున్నారు. కోటవురట్ల మండలంలో ఇసుక, గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో పూజలు నిర్వహించారు. స్వామివారి లీలలను వర్ణిస్తూ భజనలు చేశారు. 8లో



వసతి గృహాల్లో తనిఖీలు

యలమంచిలి, చోడవరం న్యాయమూర్తులు పలు వసతి గృహాలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8లో

న్యూస్‌రీల్

పుట్టపర్తికి మాడుగుల హల్వా



మాడుగుల హల్వాను ప్రత్యేక వాహనంలో పుట్టపర్తికి తీసుకు వెళుతున్న భక్తులు

మాడుగుల: పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో జరగనున్న పర్తియాత్రలో పాల్గొనున్న సత్యసాయిబాబా భక్తులకు మాడుగుల హల్వాను ప్రసాదంగా అందజేయనున్నారు. ఈమేరకు స్థానిక భక్తులు హల్వాతో ఆదివారం పుట్టపర్తికి పయనమయ్యారు. సాయి గాయత్రీ పారాయణం చేస్తూ ప్రత్యేక వాహనంలో హల్వాను తీసుకుని స్థానిక భక్తులు బయలుదేరారు.

సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలం 23న

అనకాపల్లి: జిల్లా ఆర్టీవో కార్యాలయ పరిధిలో రవాణాశాఖ అధికారులు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో సీజ్‌చేసిన వాహనాలకు ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నారు. స్థానిక జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక ఆర్టీవో కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు ఐదు గూడ్స్ వాహనాలు, ఒక మాక్సీక్యాబ్‌ను వేలం వేయనున్నట్టు ఆర్టీవో జి.మనోహర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీజ్‌చేసిన వాహనాల యజమానులకు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, వారితో పాటు ఫైనాన్షియర్లు కూడా స్పందించకపోవడంతో బహిరంగ వేలం వేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గలవారు నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

జోనల్ స్థాయి పోటీలకు తెనుగుపూడి విద్యార్థులు



ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటేషన్‌లో ప్రతిభ చూపిన తెనుగుపూడి గురుకుల విద్యార్థులు

దేవరాపల్లి: జిల్లా స్థాయి సైన్స్, ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటేషన్‌లో సత్తాచాటి జోనల్ స్థాయి పోటీలకు తెనుగుపూడి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కొక్కిరాపల్లిలోని బాలికల గురుకుల విద్యాలయంలో ఈనెల 18న జిల్లా స్థాయి సైన్స్, ఆర్ట్స్ ఎగ్జిబిషన్ కాంపిటేషన్‌లో ఆర్ట్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో తెనుగుపూడి విద్యార్థులు ప్రతిభచూపారు. సీనియర్స్ ఆర్ట్స్ విభాగంలో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి కె.ప్రవీణ్, టెన్త్ విద్యార్థి కె.సుధీర్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ ఇద్దరికి ఉమ్మడి విశాఖ గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ ఎస్.రూపావతి చేతుల మీదుగా పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు జి.అర్జునరావును డీసీవో రూపావతి, స్థానిక గురుకుల ప్రిన్సిపల్ పి.రఘు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇరటా నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

అమరావతి జేఏసీ మహిళా కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీతో రాష్ట్ర చైర్‌పర్సన్ పారె లక్ష్మి

అనకాపల్లి: అమరావతి ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ మహిళా విభాగం అనకాపల్లి డివిజన్ చైర్‌పర్సన్‌గా వి.రాజ్యలక్ష్మి (రెవెన్యూ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో కొత్తూరు పంచాయతీ శారదానగర్ జేఏసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా ఓఆర్ కళ (ఆర్టీసీ)తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఈశ్వరి, జి.ఝూన్సీ, ఇందు, కె.జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నర్సీపట్నం డివిజన్ చైర్‌పర్సన్‌గా హెచ్.త్రివేణి (రెవెన్యూ), కార్యదర్శిగా కె.నాగమణి (వీఆర్వో)తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎస్.ఎస్.రత్నం, టి.దేవకాంతం, జి.ఆర్.ఎస్.ఎస్.రత్నం, కె.వి.ఎస్.ఎల్.జి.కుమారి, ఎం.అమరావతి ఎన్నికయ్యారు. ఈఎన్నికలను ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పారెలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

జిల్లాలో హాస్టళ్ల వివరాలు..

హాస్టళ్లు	సంఖ్య	విద్యార్థులు	డైట్ చార్జీల బిల్లుల బకాయి (రూపాయిల్లో)
బీసీ	51	5,647	2,31,98,599
ఎస్సీ	31	3,145	1,22,17,730
మొత్తం	82	8,792	3,54,16,329

ప్రతి నెలా ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం చెల్లిస్తున్న డైట్ చార్జీలు ఇలా..

3-4 తరగతులు	రూ.1150
5-10 తరగతులు	రూ.1400
ఇంటర్మీడియట్ ఆ పైన	రూ.1600

హాస్టళ్లలో అప్పతిప్పలు!

సంక్షేమ వసతి గృహాలకు డైట్ బిల్లులు చెల్లించని ప్రభుత్వం

పేద విద్యార్థుల సంక్షేమం సంక్షోభంలో పడింది. ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులు అర్ధాకలితో, వార్డెన్లు అప్పుల బాధతో అలమటిస్తున్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నానని చెబుతున్న ప్రభుత్వం దానిని ఆచరించడంలేదు. రోజురోజుకు నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. అయితే ఆ స్థాయిలో ప్రభుత్వం వసతిగృహాలకు బడ్జెట్ పెంచడంలేదు. **వసతి గృహాల నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు సరిపోక మెనూలో కోత విధిస్తున్నారు. దీనికి తోడు నాలుగు నెలలుగా కూటమి ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదు. దీంతో వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థులకు అరకొరగా భోజనం పెడుతున్నారు.**

- రూ.3.54 కోట్ల వరకు బకాయిలు
- అప్పు చేసి సరకులు తెస్తున్న వార్డెన్లు
- సక్రమంగా అమలు కాని మెనూ
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



యలమంచిలి కాలేజీ విద్యార్థినుల హాస్టల్‌లో అన్నం పెడుతున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ అమలుకు అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ కష్టతరంగా మారింది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ గాడి తప్పుతోంది. పెరిగిన నిత్యావసర సరకుల ధరల మేరకు చార్జీలు పెంచాలని లేదా మెనూ మార్చాలని సంక్షేమ అధికారులు మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.ఫలితంగా వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు కావడంలేదు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం,రాత్రి భోజనం పెట్టాల్సి ఉంది.విద్యార్థులకు కడుపు నిండా అన్నం పెట్టాలంటే వార్డెన్లు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్వాకంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 51 బీసీ,31 ఎస్సీ వసతి గృహాలుండగా వీటిలో 8,792 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా డైట్ చార్జీలు విడుదల చేసేది.దీంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వార్డెన్లు పౌష్టికాహారం అందించేవారు.గత మార్చి నెలలో సాధారణ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో సంక్షేమ హాస్టళ్లకు నిధుల విడుదల నిలిచిపోయింది.ఆ తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హాస్టళ్ల నిర్వహణ క్రమంగా గాడి తప్పుతోంది. నిర్వహణ భారంతో సతమతమవుతున్న సంక్షేమాధికారులతో పాటు అవస్థలు పడుతున్న విద్యార్థుల పరిస్థితి దృష్ట్యా వెంటనే బకాయి పడిన డైట్ బిల్లులు చెల్లించి వసతి గృహాల నిర్వహణను గాడిలో పెట్టాలని కూటమి ప్రభుత్వాన్ని విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో గత జూన్ నుంచి కొన్ని వసతి గృహాలకు, జూలై నుంచి అన్ని వసతి గృహాలకు డైట్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయలేదు.వంద మంది విద్యార్థులు ఉన్న వసతి గృహం నిర్వహణ కోసం నెలకు రూ.లక్షకు పైగా ఖర్చవుతుందని సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు చెబుతున్నారు.

బియ్యం మినహాయించుకుని మిగిలిన నెలకు సరిపడా సరుకులను స్థానికంగా ఉన్న వ్యాపారుల నుంచి కొనితెస్తుంటారు. ప్రభుత్వం డైట్ చార్జీలు విడుదల చేయగానే ఒక నెల వ్యవధిలో వ్యాపారులకు డబ్బు చెల్లించేవారు.వ్యాపారులు కూడా వార్డెన్లను ఇబ్బంది పెట్టకుండా సరుకులు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నాలుగు నెలలు కావస్తున్నా డైట్ చార్జీలు విడుదల చేయలేదు. దీంతో ఒక్కో వసతి గృహానికి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయాయి. అప్పుపై సరకులు ఇవ్వలేమని కొందరు వ్యాపారులు ఖరాఖండీగా చెబుతుండగా, మరికొందరు అప్పుపై వడ్డీ సైతం అదనంగా వేసుకుంటున్నారని వార్డెన్లు వాపోతున్నారు. ఏదో ఒక నెల వరకు అంటే వ్యాపారులు అప్పుగా సరుకులు ఇస్తారని, నెలల తరబడి బకాయి ఉంటే వారు కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంటోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే డైట్ చార్జీల బకాయిలను విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



యలమంచిలి బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థినులు



యలమంచిలిలో బాలుర వసతి గృహం



యలమంచిలి బాలికల వసతి గృహంలో గోడకు అతికించిన ఆహార పదార్థాల పట్టిక

- మెస్ ఛార్జీలు నిర్ణయించే నాటికి కందిపప్పు ధర కిలో రూ.80 నుంచి రూ.90 ఉండగా ప్రస్తుతం రూ.160 ఉంది.
- నూనె ధర కూడా భారీగా పెరిగింది.
- చింతపండు,చికెన్,గుడ్లు,కూరగాయలు,ఇతర సరుకుల ధరలు దాదాపుగా రెట్టింపయ్యాయి.
- విద్యార్థులకు ఉదయం 7 గంటలకు పాలు ఇచ్చిన తర్వాత అల్పాహారం అందజేయాలి. పూరీ,పులిహోర,రెండు సార్లు ఇడ్లీ,జీలకర్ర అన్నం,బన్సీరవ్వ ఉప్మా,పెసరపప్పు పొంగలి ఇలా రోజుకో కూర, చట్నీతో పెట్టాలి.
- చాలా వసతి గృహాల్లో సాధారణ భోజనమే పెడుతున్నారు. అన్నంతో తయారుచేసే పులిహోర వంటి అల్పాహారమే అందిస్తున్నారు.
- వారానికి ఒకరోజు చికెన్ ఇస్తుండగా గుడ్డు మూడు రోజులకే పరిమితం చేశారన్న ఆరోపణలున్నాయి.
- ఉదయం అల్పాహారం తర్వాత ఇవ్వాల్సిన మిల్లెట్స్ చిక్కీ,సాయంత్రం 4.30 గంటలకు ఇవ్వాల్సిన సేమియా పాయసం,ఉడికించిన బఠాణీ ,గుగ్గిళ్లు, రాగి లడ్డు, ఉడికించిన అలసంద గుగ్గిళ్లు,మరమరాల మిక్చర్, ఉడికించిన పచ్చి శనగ గుళ్లు,రవ్వ కేసరి వంటివి చాలా హాస్టళ్లలో విద్యార్థులకు ఇవ్వడంలేదని చెబుతున్నారు.
- ప్రతి రోజూ రాత్రి పూట భోజనం తర్వాత ఇవ్వాల్సిన పండ్లు కూడా విద్యార్థులకు సక్రమంగా అందడంలేదు. కొన్ని హాస్టళ్లలో అరకొరగా ఇస్తున్నా అవి కూడా నాణ్యత లేనివేని పలువురు తెలిపారు.
- వసతి గృహాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంలేదు.దీంతో విద్యుత్ దీపాలు,నీటిని పంపింగ్ చేసే మోటార్లు,మరుగుదొడ్లు,మూత్రశాలల నిర్వహణ,కిటికీలు,తలుపుల మరమ్మతులకు వార్డెన్లు సొంత నగదు చెల్లించాల్సి వస్తోంది.హాస్టల్ నిర్వహణకు నెలకు కనీసం రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.దీంతో వార్డెన్లు తమపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడానికి నిర్వహణ నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అల్పాహారం సరిగా అందడం లేదు



సంక్షేమ వసతి గృహాల్లో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు.సాయంత్రం అల్పాహారం చాలా చోట్ల ఇవ్వడం లేదని తెలిసింది.మెనూ ప్రకారం కూరలు,గుడ్లు,ఇతర పదార్థాలు పెట్టడం లేదు.దీని వల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు.ఫలితంగా కొందరు విద్యార్థులు వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పక్కాగా అమలయ్యేలా చూడాలి.

– చింతకాయల శివాజీ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

డైట్ చార్జీలు పెంచాలి



పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు డైట్,కాస్మటిక్స్ చార్జీలను కూడా పెంచాలి.నిధుల విడుదలలో జాప్యం కారణంగా విద్యార్థులు,వార్డెన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డైట్ చార్జీలు సకాలంలో విడుదల చేయకపోవడంతో మెనూ అమలులో ఎన్నో లోపాలు జరుగుతున్నాయి.దీనిని అరికట్టడానికి ప్రభుత్వం వెంటనే స్పందించి, బకాయిలను విడుదల చేయాలి.

–మామిడి రమణ,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

బకాయిలు చెల్లించాలి



ఎస్సీ,బీసీ,ఎస్టీ వసతి గృహాలకు సంబంధించిన బకాయి బిల్లులను ప్రభుత్వం వెంటనే వసతి గృహాల అకౌంట్లలో జమ చేయాలి.నెలల తరబడి బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెడితే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా పెడతారు? ప్రభుత్వం వెంటనే స్పందించి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి.అదేవిధంగా చాలాచోట్ల వసతి గృహాల్లో ట్యూటర్లను నియమించ లేదు.కొన్ని చోట్ల వసతి గృహాల్లో ఉంటున్న డిగ్రీ విద్యార్థులతోనే ట్యూటర్ల పనిని చేయించుకుంటున్నారు.శాశ్వత ట్యూటర్లను నియమించాలి.

–మైలపల్లి బాలాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

త్వరలో బిల్లుల చెల్లింపు



డైట్ చార్జీల బకాయిల విడుదలకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.వసతి గృహాల్లో ఆహార పట్టిక అమలు చేయాలంటే ప్రస్తుతం ఇస్తున్న మెస్ చార్జీలు చాలడం లేదనే విషయాన్ని కూడా తెలియజేశాం.బిల్లుల చెల్లింపు వరుస క్రమంలో జరుగుతుంది. త్వరలోనే బకాయిలు విడుదల అవుతాయి.

–కె.రాజేశ్వరి, జిల్లా బీసీ,ఎస్సీ సంక్షేమం, సాధికారిత అధికారి

పేదలపై టీడీపీ కక్ష సాధింపు తగదు

మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ



పునాదులు తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చోడవరం: స్థానిక టీడీపీ నాయకులు పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఇది మంచిదికాదని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సయ్యపేట రెవెన్యూ పరిధిలో ఒక పేద మహిళ సొంతిల్లు నిర్మించుకునేందుకు నిర్మించిన రాతి పునాదులను రెండు రోజుల కిందట రెవెన్యూ అధికారులు జేసీబీతో తొలగించారు. తొలగించిన పునాదులను ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరిశీలించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్న స్థానిక అధికార పార్టీ నాయకులు.. పేదలకు గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలపై కూడా కన్నేశారని ఆరోపించారు. పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న ఆశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగన్న కాలనీల్లో అనేక మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, టెక్నికల్ ఇబ్బందులు వచ్చిన వారికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు(ఎల్‌పీసీ) మంజూరు చేశామని చెప్పారు. ఇలా నర్సయ్యపేట రెవెన్యూ పరిధిలో జగనన్న కాలనీకి సమీపంలో ఎలిశెట్టి పద్మ అనే నిరుపేద మహిళకు ఎల్‌పీసీ ఇచ్చినట్టు తెలిపారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి ఆమె రాతి పునాదులు,స్తంభాలు వేస్తే రాజకీయ కక్షతో స్థానిక టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసి, అధికారులను అడ్డం పెట్టుకుని తొలగించడం అన్యాయమన్నారు. ఒక పక్క ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి అమ్ముకుంటున్న కూటమి నేతలు మరో పక్క ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు.చివరికి నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కూడా వదలడం లేదని విమర్శించారు. టీడీపీ నాయకులకు వంతపాడుతున్న అధికారులు ఇలా పునాదులు తొలగించడం తగదన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రికి ఫిర్యాదుచేస్తామని ధర్మశ్రీ హెచ్చరించారు. ఇటువంటి వాటిని స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రోత్సహించడం మంచిదికాదని తెలిపారు. అధికారులే తక్షణం పునాదులు నిర్మించాలని, లేని పక్షంలో న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌లు గాడి అప్పారావు, మూడెడ్ల శంకరరావు, దంతులూరి శ్రీనివాసరాజు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు,శిరుచోళ్ల గణపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఆరోగ్య మిత్రల నిరవధిక సమ్మె




మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్య శ్రీ) పథకం ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పేదరోగులకు సేవలు అందిస్తున్న ఫీల్డ్ సిబ్బందికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతులు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఈనెల 29 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. స్థానిక కోడగంటి గోవిందరావు భవనంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న గుంటూరులో ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషాకు రాష్ట్ర నాయకులు సమ్మె నోటీస్ ఇచ్చారని చెప్పారు. ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మానటరింగ్‌కేడర్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో సమ్మె చేసేందుకు సిద్ధమైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కనకం, సంఘం గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, జిల్లా నాయకులు సోమేష్, దుర్గాప్రసాద్, మూర్తి, రమణి, శంకర్, కరుణ, రత్నకుమారి, జయమని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ విద్య... అంతా మిథ్య -8లో

వడ్డాది డైవర్షన్ రోడ్డుపైకి భారీగా వరద నీరు

- కుంగిన వంతెనపై నుంచి ప్రయాణించిన వాహనాలు
- ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇక్కట్లు



వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి ఆదివారం భారీ ఎత్తున వరద నీరు ప్రవహించడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రయాణించే అవకాశం లేకపోవడంతో పక్కనే ఉన్న శిథిలావస్థకు చేరిన కుంగిన వంతెనపై నుంచి వాహనాలు రాకపోకలు సాగించాయి. వంతెన ఇరుకుగా ఉండడంతో పాటు పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. నర్సీపట్నం, చోడవరం,పాడేరు,విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం వడ్డాదిలో జరిగిన వారపు సంతకు వచ్చిన వారితో పాటు వివాహాలు,ఇతర శుభకార్యాలకు వెళ్లే వేలాది మంది ఇబ్బంది పడ్డారు. అత్యవసర పనులపై వెళ్లాల్సిన వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతం. బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పెద్దేరులో ప్రవహిస్తున్న వరద నీటిని తోడు పెద్దేరు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.డైవర్షన్ ఖానాల వద్ద తుప్పలు అడ్డంగా ఉండిపోవడంతో వరద నీరు డైవర్షన్ రోడ్డుపైకి చేరిందని,ఆర్‌అండ్‌బీ అధికారులు తుప్పలు, డొంకలను తొలగిస్తే ఇటువంటి ఇబ్బందులు ఏర్పడవని వాహనచోదకులు తెలిపారు.

క్లుప్తంగా

బాల్ బ్యాడ్మింటన్‌తో ఉజ్వల భవిష్యత్తు

అనకాపల్లి: బాల్‌బ్యాడ్మింటన్ క్రీడతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఏపీ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి భీమరశెట్టి ఆదినారాయణ అన్నారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి గ్రామీణ క్రీడల్లో ప్రధానమైన బాల్‌బ్యాడ్మింటన్‌కు రాష్ట్రంలో మంచి ఆదరణ ఉందన్నారు. పండగలు, వేడుకల సమయంలో గ్రామాల్లో ఈ పోటీలు నిర్వహించడం గొప్ప విషయన్నారు. గతంలో విశాఖ, నర్సీపట్నం, యలమంచిలి, ఏటికొప్పాక, మాడుగుల, నునపర్తి, అర్జాపురం, చోడవరం తదితర ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

యలమంచిలి రూరల్: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాల గడువు పొడిగించాలని అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ నాగేశ్వరరావు ముగిసిన గడువును ఈ నెల 31 వరకూ పొడిగించినట్టు పేర్కొన్నారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 31 తేదీ వరకు రూ.200 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సమీపంలోని ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రాల ద్వారా గానీ, ఎంఈవో కార్యాలయాల ద్వారా గానీ, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ద్వారా గానీ, సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చునని ఆమె పేర్కొన్నారు.

సరుగుడు వద్ద సందర్శకుల సందడి



జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలు ఆడేందుకు పోటీ పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సరదాగా గడిపారు. తాండవ రిజర్వాయర్ వద్ద కూడా సందర్శకుల సందడి కనిపించింది.

ఇది మా ప్రభుత్వం..

దొరికినంతా దోచేస్తాం.!



చినబొడ్డేపల్లిలో కొండపై పొక్లెయిన్‌తో అక్రమ తవ్వకాలు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- కొండలను సైతం వదలని కూటమి నేతలు



పందూరు శివారు ఇందేశమ్మవాక వద్ద నదిలో ఇసుక తవ్వకాల కోసం దిగిన నాటు బళ్లు

కోటవురట్ల: 'దొరికినంతా దోచుకోండి.. మన ప్రభుత్వంలో ఏదైనా మీ తర్వాతే.. ఇసుక, గ్రావెల్ ఏదైనా కానీ అందినకాడికి అమ్మేసుకోండి' ఇది కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకు దొరుకుతున్న భరోసా. దాంతో కొందరు కూటమి కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. ఎవరి పరిధిలో వారు దొరికినంతా దోచేస్తున్నారు. కోటవురట్ల మండలంలో ఇసుక, గ్రావెల్‌కు కొరతే లేదు. దాంతో ఇసుక, గ్రావెల్‌ను అక్రమంగా తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో గండి కొడుతున్నారు. అక్రమ మైనింగ్‌పై అధికారుల నియంత్రణ పూర్తిగా కొరవడడంతో రాత్రీ పగలూ తేడా లేకుండా తరలించుకుపోతున్నారు. జంకూ బొంకూ లేకుండా అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నారు. వరాహనదిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. నదిలో 6 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. పాత గొట్టివాడకు చెందిన ఇద్దరు జనసేన నాయకులు తమ ట్రాక్టర్ల ద్వారా ఇసుక దందా సాగిస్తున్నారు. కొత్త గొట్టివాడలో ఓ టీడీపీ నేత దర్జాగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. పందూరు శివారు ఇందేశమ్మవాక వద్ద భారీ స్థాయిలో దార్లపూడికి చెందిన టీడీపీ నాయకులు ఇసుకను తరలించుకుపోతున్నారు. మొత్తం ఆరు పాయింట్లు ఏర్పాటు చేసి నాటు బళ్ల ద్వారా ఒడ్డుకు చేర్చి పాయింట్లో డంప్ చేసి ఆపై ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. ఏమాత్రం వెరవక రహదారుల పక్కనే తమకు చెందిన స్థలాల్లో ఇసుకను డంప్ చేసి విక్రయాలు చేస్తున్నారు. ఇందేశమ్మవాక వద్ద 150 నాటు బళ్లతో రోజుకు 4 ట్రిప్పులు ఇసుకను ఒడ్డుకు చేరుస్తున్నారు. అంటే రోజుకు 600 నాటు బళ్లతో ఇసుకను ఒడ్డుకు చేర్చి ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న మామిడి తోటలు, పోలవరం కాలువ ప్రాంతాల్లో ఇసుకను నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి రోజుకు 6 లారీల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు సమాచారం. మిగతా ఐదు పాయింట్ల నుంచి ఒక్కొక్క లారీ టార్గెట్‌గా ఇసుకను తరలిస్తున్నారు. అధికారులు నామమాత్రంగా దాడి చేసి వదిలేయడంతో ఈ దందాకు అడ్డుకట్ట పడడంలేదు. అధికారులకు సమాచారం ఇచ్చిన క్షణాల్లో అక్రమార్కులకు విషయం తెలిసిపోతోంది. దాంతో దాడి చేసే సమయానికి అందరూ పరారవుతున్నారు. అక్రమార్కులు ఎక్కడికక్కడ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని ఇసుక దందా సాగిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- గ్రావెల్ విషయానికి వస్తే చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో 4 కొండలపై అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ నాలుగు కొండలపై ఒకే వ్యక్తి దందా సాగించి రాయి, గ్రావెల్‌ను తరించుకుపోతున్నాడు. నిత్యం తవ్వకాలు సాగిస్తున్నా అధికారులు మాత్రం తమకు సమాచారం లేదనడం పరిపాటిగా మారింది. చినబొడ్డేపల్లి రెవెన్యూ పరిధిలో కరణం కొత్తూరు, చినబొడ్డేపల్లి ప్రాంతంలో రెండు కొండలు, మల్లవరం వెళ్లే రహదారిలో ఓ కొండ సగం వరకు తరిగిపోయాయి. ఇంత దారుణంగా తవ్వకాలు జరుపుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. రెడ్డి కొత్తూరుకు చెందిన టీడీపీ నాయకుడు తన పొక్లెయిన్, ట్రాక్టర్ల ద్వారా అక్రమ దందాకు పాల్పడుతున్నాడు. ఇది మా ప్రభుత్వం.. మా రెవెన్యూలో కొండలు మా ఇష్టం అంటూ తవ్వకాలకు పాల్పడడం గమనార్హం. ఇదే తంతు కొనసాగితే కొండలు మాయమై పర్యావరణానికి ముప్పు తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పైలట్ ప్రాజెక్టుకు సమీపంలో మామిడి తోటలో నిల్వ చేసిన ఇసుక

- ఇసుక అక్రమ తవ్వకాలపై ఎస్‌ఐ ఎస్.రమేష్‌ను వివరణ కోరగా.. వరాహనదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నాటుబళ్లపై ఇసుకను తరలించి ఓ చోట నిల్వ చేసి విక్రయాలు చేస్తే చట్టపరంగా కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నునపర్తి కూటమిలో బయటపడ్డ విభేదాలు

వాయిదా పడిన 'పల్లె పండగ'

అచ్యుతాపురం(మునగపాక): నునపర్తిలో కూటమి నేతల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ వారోత్సవాలు వాయిదా పడ్డాయి. అచ్యుతాపురం మండలం నునపర్తిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే విజయకుమార్ చేతుల మీదుగా ఆదివారం శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. బీజేపీ తరఫున నునపర్తి సర్పంచ్ అనురాధ వర్గం గ్రామంలో టెంట్ వేశారు. ఈ టెంట్‌కు కొద్ది పాటి దూరంలో టీడీపీ నేతలు నగేష్, నరసింహనాయుడు మరో వర్గంగా టెంట్ వేశారు. కాగా కూటమిలో రెండు పార్టీలకు చెందిన నేతలు చెరో టెంట్ వేసుకోవడాన్ని గుర్తించిన ఎమ్మెల్యే విజయకుమార్ గ్రామంలో గొడవలు జరిగే అవకాశం ఉందని గ్రహించి పల్లె పండగ కార్యక్రమాన్ని అర్ధాంతరంగా వాయిదా వేసుకున్నారు. మరో వైపు ఎమ్మెల్యే సొంత పార్టీ అయిన గ్రామ జనసేన నాయకులు పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. వారిని ఎవరూ ఖాతరు చేయకపోవడంతో వారికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. మొత్తమ్మీద నునపర్తిలో కూటమి నేతల్లో విభేదాలు మరోసారి బహిర్గతం కావడంతో చర్చనీయాంశమైంది.

తాచేరు నదిలో మునిగి ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు వద్ద విలపిస్తున్న రైతు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిలో మునిగి దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు కోరుబిల్లి అప్పలనాయుడు శనివారం సాయంత్రం తన పొలంలో మేతకు ఎద్దులను తీసుకెళ్లాడు. రాత్రి పశువుల పాకకు వచ్చే సమయంలో ఎద్దు ఒకటి తాచేరు నదిలో పడిపోయి మృతి చెందింది. దీనివల్ల సుమారు రూ.50 వేలు నష్టం జరిగినట్టు బాధిత రైతు వాపోయాడు. తాచేరు డైవర్షన్ రోడ్డు కాంట్రాక్టర్ తీరు వల్లే ఈ అనర్థం జరిగిందని బాధిత రైతు వాపోతున్నాడు. గత నెలలో కురిసిన వర్షాలకు తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డుకు గండి పడిందని, గండిని పూడ్చి కాంట్రాక్టర్ సొంతంగా సిమెంట్ గొట్టాలు తెచ్చుకోకుండా తమ పొలాలకు సొంత నిధులతో వేసుకున్న గొట్టాలను తీసి డైవర్షన్ రోడ్డుకు వేశాడన్నారు. కొత్తగా గొట్టాలు తెచ్చి మా పొలాలకు వెళ్లే దారిలో వేస్తామని చెప్పి వేయకపోవడం వల్ల దారి సరిగా లేక ఎద్దు తాచేరు నది నీటిలో పడి మృతి చెందిందని బాధిత రైతు తెలిపాడు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

వసతి గృహాల్లో ఆకస్మిక తనిఖీలు



బీసీ కళాశాల బాలురలను మెనూ సమస్యలపై ఆరా తీస్తున్న జడ్జి విజయ



దేవరాపల్లి వసతి గృహాన్ని పరిశీలిస్తున్న చోడవరం సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు

పాయకరావుపేట: విద్యార్థులకు సక్రమంగా మెనూ అమలు చేయాలని యలమంచిలి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) పి.విజయ వార్డెన్లకు సూచించారు. పట్టణంలోని ఐదు వసతి గృహాలను ఆమె ఆదివారం తనిఖీ చేశారు. తొలుగ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి, వంట గదులను తనిఖీ చేశారు. అనంతరం బాలికలతో మాట్లాడారు. మెనూ అమలుపై ఆరా తీశారు. మెనూ అమలులో నిర్లక్ష్యం చేయొద్దని వార్డెన్ బి.రమణమ్మకు సూచించారు.

- ఎస్సీ బాలుర-2 వసతి గృహాన్ని జడ్జి పరిశీలించారు. విద్యార్థుల గదులను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. బాత్ రూమ్స్, వంట గది, వంట సామగ్రిని పరిశీలించారు. హెచ్‌డబ్ల్యూవో వి.బాబూరావుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.
- బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని కూడా జడ్జి సందర్శించి బాలికలతో మాట్లాడారు. సమస్యలుంటే చెప్పాలని అడిగారు. వసతి గృహం ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో ఉందని, మరింత సౌకర్యాలు కలిగిన భవనంలోకి మార్చడానికి ప్రయత్నించాలని వార్డెన్ ఏఈ భవానీకి ఆమె సూచించారు. అదే విధంగా బీసీ కళాశాల బాలుర వసతి గృహం వంట గదిని పరిశీలించారు. వంటలను రుచి చూశారు. అనంతరం ఎస్సీ బా య్స్-2 వసతి గృహంను పరిశీలించారు. సమస్యలు, మెనూ అమలుపై విద్యార్థులను ఆరా తీశారు. నక్కపల్లి కేజీబీవీ పాఠశాలను కూడా ఆమె పరిశీలించారు.

బీసీ వసతి గృహం పరిశీలన

దేవరాపల్లి: దేవరాపల్లిలోని బీసీ బాలుర వసతి గృహాన్ని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఈ.రాజేంద్రబాబు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులు, వంట గది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం సక్రమంగా అందిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షం పడితే కారిపోతోందని స్థానిక వార్డెన్ కె.వి.లక్ష్మీనారాయణ జడ్జికి వివరించారు. మరుగుదొడ్లు సైతం పూర్తిగా పాడైపోయామన్నారు. వర్షం పడితే ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుందోనని ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా విద్యార్థులను వేరే చోటకు తరలిస్తున్నామని వార్డెన్ వివరించారు.



బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు సీనియర్ సివిల్ జడ్జి సూర్యకళ

హాస్టళ్ల నిర్వహణలో అలసత్వం వద్దు

చోడవరం: వసతి గృహాల నిర్వహణలో అసత్వం వద్దని చోడవరం ఎడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి సూర్యకళ అన్నారు. రావికమతం మండలం బీసీ బాలుర, బాలికల వసతి గృహాలు, కేజీబీవీని ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇచ్చే కాస్మెటిక్స్, ఇతర వస్తువులు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగారు. ఎస్సీ హాస్టల్ భవనం శ్లాబ్ దెబ్బతిందని, దీనికి మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని ఆదేశించారు. కొత్తకోట వసతి గృహంలో 93 మంది విద్యార్థులకు గాను 65 మంది మాత్రమే ఉండడంపై అక్కడి సిబ్బందిని న్యాయమూర్తి ఆరా తీశారు. దీనిపై వార్డెన్ వివరణ ఇచ్చారు. హైకోర్టు ఆదేశాల మేరకు వసతిగృహాలను తనిఖీ చేస్తున్నామని, నివేదిక తయారు చేసి పంపిస్తామని న్యాయమూర్తి సూర్యకళ తెలిపారు. ఆమె వెంట ఏఎస్‌ఐ బాలయ్య ఉన్నారు.

సాయంకాలం.. చదువుల తీరం!

- విశాఖలోని 'గైస్'లో డిప్లమో కోర్సులకు అవకాశం
- మరోరెండు ప్రైవేట్ కాలేజీలకూ సాయంకాలం కోర్సులకు అనుమతి
- పదోన్నతులు పొందాలనుకున్న వారికి అరుదైన అవకాశం

ఫీజు వివరాలు: సెమిస్టర్‌కు రూ.18 వేలు

మురళీనగర్(విశాఖ ఉత్తర): పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న వారు పదోన్నతులు పొందేందుకు గాను తమ విద్యార్హతలను పెంచుకునే అవకాశం లభిస్తే.. భలే ఉంటుంది కదూ. డిప్లమో కోర్సులను సాయం కాలం చదివే అరుదైన అవకాశం విశాఖ నగరంలోని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇనిస్టిట్యూట్(గైస్) అందిస్తోంది. రాష్ట్రంలో 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుండగా సాయంకాలం కోర్సులు నిర్వహణకు విశాఖలోని గైస్‌ను ఏఐసీటీఈ ఎంపిక చేయడం విశేషం. అలాగే మరో రెండు ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలలు.. బెహరా(నరవ), ప్రశాంతి(అచ్యుతాపురం)లలోనూ సాయంత్రం కోర్సుల నిర్వహణకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతిచ్చింది.

టైమింగ్స్:

రోజూ సాయంత్రం 6.30 నుంచి 9 గంటల వరకు, ఆదివారం, సెలవు దినాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 వరకూ తరగతులు నిర్వహిస్తారు.

వచ్చే నెల ఒకటి నుంచి తరగతులు

కెమికల్ ఇంజనీరింగ్, పెట్రో కెమికల్స్, ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్ విభాగాల్లో వర్కింగ్ ప్రొఫెషనల్స్‌గా 2024–25 విద్యా సంవత్సరంలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ మేరకు కోర్సులను నవంబర్ 1న ప్రారంభిస్తారు. ప్రతి కోర్సులోనూ 33 సీట్లుండగా.. వీటిలో 3 ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి ఉంటాయి. వీరు ఈ నెల 21 నుంచి 26వ వరకు సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే బెహరా పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ప్రశాంతి పాలిటెక్నిక్ కాలేజీ(అచ్యుతాపురం)లో సివిల్ , మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.



కెమికల్ ఇంజనీరింగ్ కాలేజీ(కంచరపాలెం)

అర్హత: గుర్తింపు పొందిన పరిశ్రమల్లో, లేదా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో, ప్రభుత్వ లేదా ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంటర్ ఎంపీసీ/ బైపీసీ/ఐవీసీ/లేదా ఐటీఐ సర్టిఫికెట్‌తో కెమికల్ ప్లాంట్ మెయింటెనెన్స్ మెకానిక్/అటెండెంట్ ఆపరేటర్, లేబొరేటరీ అసిస్టెంట్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ తదితర విభాగాల్లో కనీసం ఏడాది రెగ్యులర్ ఉద్యోగిగా పనిచేస్తూ.. పై మూడు కళాశాలకు 50 కిలోమీటర్ల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తి గలవారు ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 30న ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు.

ఇదొక సదావకాశం



సాయంకాలం కోర్సుల్లో చేరడం గొప్ప సదావకాశంగా భావించాలి. పరిశ్రమలు, ఇతర రంగాల్లో పనిచేస్తున్నవారు ఈ కోర్సుల్లో చేరి పదోన్నతులు పొందొచ్చు. ప్రభుత్వం పాలిటెక్నిక్ కాలేజీల్లో గైస్‌కు ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు.

–డాక్టర్ కె.వెంకరమణ, ప్రిన్సిపాల్, గైస్, కంచరపాలెం

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. కార్తీక దామోదర మాస ఉత్సవాలు రెండోరోజు వైభవంగా ప్రారంభమ య్యాయి. ఉత్సవాల్లో భాగంగా వేకువ జామున 4.30 గంటల నుంచి 6 వరకు ప్రత్యేక కార్యక్రమాలు, మంగళహారతి, నర్సింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీప సమర్పణ, గజేంద్ర స్తుతి, దామోదరాష్టకం, గోపి గీత, భగవద్గీత, శిష్టాష్టకం, యుగలాష్టకం పారాయణం నిర్వహించినట్టు ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ తెలిపారు.

ఇరువర్గాల వివాదంలో ఐదుగురిపై కేసు

మాకవరపాలెం: రెండు వర్గాల మధ్య తలెత్తిన వివాదంలో ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జి.కోడూరుకు చెందిన శానాపతి శేషు, చవ్వాకుల శ్రీనుకు లారీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి మధ్య నర్సీపట్నం లారీ యార్డులో ఇటీవల గొడవ జరిగింది. మళ్లీ శుక్రవారం జి.కోడూరులో జరిగిన వివాదంలో చవ్వాకుల శ్రీను, వీరబాబు తమపై దాడి చేశారంటూ శానాపతి శేషు, సకిరెడ్డి నానాజీ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం శ్రీను, వీరబాబుపై శేషు, మరికొందరు దాడి చేశారని శ్రీను ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాలకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విశాఖ- రాయపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల కోరిక మేరకు విశాఖపట్నం–రాయపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. మారిన వేళలు ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. విశాఖపట్నం –రాయ్‌పూర్(08528) పాసింజర్ స్పెషల్ ప్రతి రోజూ ఉదయం 6.30 గంటలకు బదులుగా ఉదయం 4.25 గంటలకు విశాఖలో బయలుదేరుతుంది. ప్రతి రోజూ రాత్రి 7.45 గంటలకు రాయ్‌పూర్ చేరుకుంటుంది.

ఓపెన్ విద్య.. అంతా మిథ్య

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 80 స్టడీ సెంటర్లు
- ఏటా ఐదు వేల మందికి పైగా విద్యార్థులు చేరిక
- పాస్ గ్యారెంటీ పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు
- గుర్తింపు లేని కేంద్రాల్లోనూ అడ్మిషన్లు
- ఏసీబీ ట్రాప్‌తో బాగోతం బట్టబయలు

■ ప్రైవేటు స్టడీ సెంటర్ మంజూరు కోసమని లంచం తీసుకుంటూ అనకాపల్లి జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్‌ను ఏసీబీ అధికారులు ఇటీవల రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సార్వత్రిక విద్యలో జరుగుతున్న అక్రమాలకు ఈ ఉదంతం ఓ ఉదాహరణ.

■ నగరంలో శ్రీనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీకి ఇంటర్ బోర్డు నుంచి గుర్తింపు లేదు. అయితే ఈ కాలేజీ కోడ్‌తో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు తీసుకున్నారు. విషయం ఆలస్యంగా తెలుసుకున్న విద్యాశాఖాధికారులు.. దీన్ని ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. కానీ సప్లిమెంటరీ పరీక్షలకు ఆ కాలేజీ పేరుతో విద్యార్థులు హాజరవుతుండటం గమనార్హం.

ఇదీ జిల్లాలో సార్వత్రిక విద్యా విధానం పరిస్థితి..

విశాఖ విద్య: అనివార్య కారణాలతో చదువులు మధ్యలోనే ఆపేసిన వారు 10వ తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ సొసైటీ ఏర్పాటు చేసింది. గుర్తింపు పొందిన స్టడీ సెంటర్ల ద్వారా ఏటా ప్రవేశాలు కల్పించి వార్షిక పరీక్షలు నిర్వహిస్తోంది. రెగ్యులర్ కోర్సులతో సమాన గుర్తింపు ఉండటంతో ఓపెన్ విధానంలో టెన్త్, ఇంటర్‌లో చేరేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. విశాఖ జిల్లాలో 17, అనకాపల్లిలో 33, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మొత్తం 30 స్టడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఏటా ఐదు వేలకు పైగా విద్యార్థులు ప్రవేశాలు పొందుతుండగా, అనకాపల్లి జిల్లా నుంచే ఎక్కువ మంది చేరుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో అనకాపల్లిలో జిల్లాలో 19 ప్రైవేట్ సెంటర్లు నిర్వహిస్తున్నారు.

తరగతుల నిర్వహణపై శ్రద్ధ ఏదీ?

ఓపెన్ స్కూల్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫోకస్ పెట్టారు. స్టడీ సెంటర్ల నిర్వాహకుల పెత్తనాన్ని తగ్గించేలా ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చారు. పాఠ్య పుస్తకాలను సకాలంలో నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా పంపించి, తరగతుల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారు. కానీ ఈ ఏడాది తరగతుల నిర్వహణ సవ్యంగా సాగడం లేదు. 2024–25 విద్యా సంవత్సరానికి సార్వత్రిక విద్యా విధానంలో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. పలు దఫాలు గడువు పెంచిన అధికారులు.. చివరి అవకాశం అంటూ ఈ నెల 25 వరకు ప్రవేశాలు పొందవచ్చని ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. షెడ్యూల్ మేరకు 30 కాంటాక్ట్ క్లాసులు నిర్వహించాలి. కానీ ఇప్పటికే చేరిన వారిని పరీక్షలకు సన్నద్ధం చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

అడిగినంత ఇవ్వాల్సిందే..

ఓపెన్ స్కూల్స్‌లో ఇంటర్మీడియెట్‌కు జనరల్ కేటగిరీ వారైతే రూ.1,400, రిజర్వేషన్ అభ్యర్థులకు రూ.1,100లు ఫీజుగా చెల్లించాలి. టెన్త్‌కు జనరల్ వారికి రూ.1,300, రిజర్వేషన్ ఉన్న వారు రూ.900 చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశం పొందే అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్ విధానంలో ఫీజు చెల్లించవచ్చు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వివిధ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులు ఈ కోర్సుల్లో ఎక్కువగా చేరుతున్నారు. దీంతో కొన్ని ప్రవేట్ స్టడీ సెంటర్ల నిర్వాహకులకు పాస్ గ్యారెంటీ పేరుతో నిర్దేశిత ఫీజు కంటే అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. గత వార్షిక పరీక్షల సమయంలో విశాఖ జిల్లాలోని భీమునిపట్నం కేంద్రంలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాస్తూ స్క్వాడ్ టీమ్‌కు పట్టుబడటం ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది.



విశాఖలోని ఓ స్టడీ సెంటర్‌లో తరగతులకు హాజరైన విద్యార్థులు

తరగతుల నిర్వహణపై దృష్టి

షెడ్యూల్ మేరకు తరగతులు నిర్వహించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. పుస్తకాలు నేరుగా విద్యార్థుల ఇళ్లకే పోస్ట్ ద్వారా చేరుతాయి. సర్టిఫికెట్లు కూడా విద్యార్థుల ఇంటి చిరునామాకు పంపిస్తున్నాం.

– మురళీ మోహన్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, విశాఖ జిల్లా

క్లుప్తంగా

రేపు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడి రాక

అనకాపల్లి: ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఈనెల 22న జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు కమిషన్ ప్రధాన కార్యాలయం కార్యదర్శి ఎస్.పద్మజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 రాత్రి 10 గంటలకు మంగళగిరి నుంచి రోడ్డు మార్గాన అనకాపల్లికి చేరుకుంటారని, 22 ఉదయం 11 గంటలకు కలెక్టర్ విజయ కృష్ణన్‌తో సమావేశం ఉంటుందన్నారు. జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి సమావేశం, అనంతరం ఎస్పీ కార్యాలయంలో పోక్సో కేసులు, బాల్య వివాహాల నివారణపై నేటి వరకూ తీసుకున్న జాగ్రత్తలపై చర్చిస్తారని ఆమె తెలిపారు.

పెరిగిన శారదా నది నీటి మట్టం

కశింకోట: శారదా నది నీటి మట్టం ఆదివారం పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నది పొంగి ప్రవహిస్తోంది. దీంతో స్థానిక గవరపేట ప్రాంతంలో పొలాలకు రాకపోకలు సాగించడానికి వినియోగించే దోనెలపై పరిమితంగా నదిని దాటిస్తుండటంతో తమ నిత్య కార్యకలాపాలకు అవరోధం కలగడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. కొందరు రైతులు గ్రామ శివారులో ఉన్న వంతెన మీదుగా సుమారు 3 కిలోమీటర్ల దూరం నడిచి తమ కార్యకలాపాలు నిర్వహించుకున్నారు.

పాల ధర తగ్గింపుపై రైతుల ఆగ్రహం

బుచ్చెయ్యపేట : తగ్గించిన పాల ధరను వెంటనే పెంచి ఆదుకోవాలని ఆదివారం విజయ రామరాజుపేట పాల కేంద్రం వద్ద పలువురు రైతులు నిరసన తెలిపారు. ఒక పక్క తవుడు ఇతర పశు దాణా రేట్లు పెరిగి పశు పోషణ భారంగా మారగా గతంలో ఇచ్చిన ధరను 4 రూపాయల వరకు తగ్గించడం అన్యాయమని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలి



గణపర్తి పాలకేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మునగపాక: తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని సీపీఎం నాయకుడు కర్రి అప్పారావు కోరారు. మండలంలోని గణపర్తి పాల కేంద్రం ఎదుట రైతులతో కలిసి ఆదివారం ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతులను ఆదుకోవాల్సింది పోయి ఆవు పాలకు సంబంధించి లీటరు ఒక్కంటికి రూ.4 చొప్పున తగ్గించడం సరికాదన్నారు. రైతులకు న్యాయం జరిగేలా పాల ధరను పెంచడంతో పాటు బోనస్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత బ్రహ్మాజీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	:సత్యనారాయణ స్క్రీన్-1
లవ్‌రెడ్డి	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	:పర్తిసాయి
వేట్టయాన్	:షిర్డీసాయి
వీక్షణం	:వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	:శ్రీసత్య
రివైండ్ (మాట్నీ, సెకండ్ షో)	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-18 యూనిట్లు, ఓ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 256 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 198 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (నంబర్ 08924223595ని సంప్రదించవచ్చు.



అసంపూర్తి భవనంలోనే చిన్నారుల నేల బారు చదువు



కెమిస్ట్రీ ల్యాబ్‌కు తుది మెరుగులు



ఆరు బయట భోజనం చేస్తున్న విద్యార్థినులు

చదువుల నెలవు.. వసతులు కరవు

స్థానిక బాలికల హైస్కూల్లో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. మండలంలోని అన్ని స్కూళ్ల కంటే ఇక్కడే అత్యధిక మంది బాలికలు చదువుతున్నారు. ఉభయ విశాఖ జిల్లాల నుంచి వచ్చిన వారు అధికంగా ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. అయితే తగిన సౌకర్యాలు కరవు కావడంతో చదువులో పూర్తి స్థాయిలో రాణించడానికి అవకాశం లేకపోతోందని వాపోతున్నారు.

- బాలికల హైస్కూల్లో సదుపాయాల కొరత
- కూర్చునేందుకు బెంచీలు లేవు
- డైనింగ్ హాలు లేక ఆరుబయటే భోజనాలు
- విద్యుత్ సదుపాయమూ లేదు



కశింకోట బాలికల హైస్కూలు

కశింకోట: స్థానిక మండల పరిషత్ ఆవరణలో ఉన్న బాలికల హైస్కూల్లో సుమారు 720 మంది బాలికలు చదువుతున్నారు. మండలంలో 13 హైస్కూళ్లు ఉండగా వాటన్నింటి కంటే ఇక్కడే ఎక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో స్థానికేతలులే అధికం. సుమారు 400 మంది వారే చదువుతున్నారు. పూర్వ విశాఖ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి ఎక్కువ మంది విద్యార్థులు వచ్చి చదువుతున్నారు. స్కూలు పక్కనే సమగ్ర వసతి గృహం అందుబాటులో ఉండటంతో వీరికి ఇక్కడ చదువుకోవడం సౌకర్యవంతంగా ఉంది. అయితే పాఠశాలలో మాత్రం పూర్తి స్థాయిలో సరైన సదుపాయాలు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 61 లక్షల తొలి విడత నాడు-నేడు కార్యక్రమంలో తరగతి గదులకు మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సదుపాయం కల్పించి, పాద బాటలు ఏర్పాటు చేశారు. రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. రెండో విడతలో రూ.36 లక్షల నిధులతో మూడు గదులను మంజూరు చేశారు. ఈ మేరకు వాటి నిర్మాణం చేపట్టి నిధులున్న మేరకు ఖర్చు చేశారు. సుమారు రూ.20 లక్షలు వెచ్చించారు. ఇంకా గచ్చులు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు వగైరా సదుపాయం కల్పించాల్సి ఉంది. బల్లలు, ఫర్నిచర్ సమకూర్చాల్సి ఉంది. ఇందుకు గతంలోనే నిధులు మంజూరైనప్పటికీ ఇంకా వాటిని సమకూర్చలేదు. దీంతో వసతి కొరత నేపథ్యంలో 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 80 మంది విద్యార్థులకు అసంపూర్తి భవనంలోనే తరగతులను నిర్వహించాల్సి వస్తోంది. వారికి బెంచీలు లేకపోవడం వల్ల నేల మీదే కూర్చుంటున్నారు. విద్యుత్ సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీని దృష్ట్యా మంజూరైన నిధులతో ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పించి తరగతులు పూర్తి కావడానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పీఎంశ్రీలో ఒక ల్యాబ్ మంజూరు..

బాలికల హైస్కూలు పీఎంశ్రీ పథకం కింద రెండేళ్ల క్రితం ఎంపికైంది. ఈ మేరకు కెమిస్ట్రీ ల్యాబ్ గదికి రూ.15.60 లక్షలు మంజూరైంది. దీంతో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటోంది. త్వరలోనే ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నారు. అలాగే మిగిలిన ల్యాబ్‌లను సమకూర్చడానికి అధికారులు చర్యలు చేపట్టాలంటున్నారు. మధ్యాహ్న భోజనం చేయడానికి డైనింగ్ హాలు లేదు. దీంతో విద్యార్థులు ఆరు బయట, తరగతి గదులు, వాటి వరండాల్లో భోజనం చేయాల్సిన పరిస్థితి. వర్షం వస్తే భోజనం చేయడానికి మరింత ఇబ్బంది పడుతున్నారు. దీని దృష్ట్యా డైనింగ్ హాలు నిర్మించాల్సి ఉంది. స్కూల్లో ఫంక్షన్ హాలు కూడా లేదు. దీంతో విద్యార్థులతో సమావేశాలు, జాతీయ నాయకులు, శాస్త్రవేత్తల జయంతి, వర్ధంతి, ఇతర విద్యార్థి సంబంధిత ఫంక్షన్లు నిర్వహించడానికి అవకాశం లేకపోతోంది. దీన్ని కూడా నిర్మించాల్సి ఉంది. పాఠశాల క్రీడా మైదానం విశాలంగా ఉన్నప్పటికీ ఆటలు ఆడటానికి అనువుగా లేదు. చుట్టు పక్కల ప్రాంతం తుప్పలతో నిండి ఉంది. వాటిలో ఒక్కొక్కసారి పొంచి ఉండే పాములు, విష పురుగుల వల్ల హాని జరిగే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దీనిదృష్ట్యా తుప్పలు తొలగించి శుభ్రపరచాలని, ఆటలాడటానికి అనువుగా వాలీబాల్, షటిల్ తదితర కోర్టులు ఏర్పాటు చేసి అందుబాటులోకి తేవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న మూడు తరగతి గదులు

సైన్స్ ల్యాబ్‌లోనే అన్ని ల్యాబ్‌లు..

అలాగే స్కూల్లో వసతి సదుపాయం లేక సైన్స్ ల్యాబ్‌లోనే కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్ వగైరా ల్యాబ్‌లు నిర్వహించాల్సి వస్తోంది. ఒకేచోట వీటిని నిర్వహించడం, బోధన సాగించడం కష్టంగా పరిణమించడంతో ఆయా అంశాల్లో అవగాహన కొరవడి వెనుకబడాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. అలాగే అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్, ఒకేషనల్, గణిత ల్యాబ్‌లను కూడా ఏర్పాటు చేసి సదుపాయాలు మెరుగుపర్చాల్సి ఉంది.

వసతులపై అధికారులకు నివేదించాం..

పాఠశాలలో కల్పించాల్సిన సదుపాయాలపై అధికారులకు నివేదించాం. రెండో విడత నాడు-నేడు కార్యక్రమంలో రూ.36 లక్షలతో మంజూరైన 3 గదులు దాదాపు పూర్తి కావచ్చాయి. అయితే గచ్చులు వంటి తుది మెరుగులు దిద్ది ఇతర సదుపాయాలు కల్పించాల్సి ఉంది. వసతి కొరతతో వాటిలోనే తరగతులు నిర్వహిస్తున్నాం. పీఎంశ్రీ పథకంలో ఎంపికైన స్కూలుకి రూ.15.60 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ మంజూరైంది. ఆ గది నిర్మాణం తుది మెరుగులు దిద్దుకుంటోంది. త్వరలో ప్రారంభించి అందుబాటులోకి తీసుకు రావడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా కంప్యూటర్, అటల్ టింకరింగ్ ల్యాబ్, గణిత శాస్త్ర ల్యాబ్, ఒకేషనల్ తదితర ల్యాబ్‌లు ఉండాల్సి ఉంది. ఇవి పీఎంశ్రీ పథకంలో ముందుందు సమకూరే అవకాశం ఉంది. మైదానంలో ఆటలు ఆడటానికి త్వరలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

–ఎంఎస్ స్వర్ణకుమారి, హెచ్‌ఎం, బాలికల హైస్కూలు, కశింకోట.

పల్లె పండగతో గ్రామ స్వరాజ్యం



తారు రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు కొణతాల, కేఎస్ఎన్ఎస్ రాజు

కశింకోట: పల్లె పండగ కార్యక్రమంతో గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని ఈ.చొడువాడ, సుందరయ్యపేట, చెరకాం, తీడ గ్రామాల్లో సుమారు రూ.కోటి 86 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, జల్‌జీవన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిలు ఇవ్వడానికి పైపులైన్ల నిర్మాణ పనులకు పల్లె పండగ కార్యక్రమంలో ఆదివారం శ్రీకారం చుట్టారు. దీంతో పాటు అనకాపల్లి, చోడవరం నియోజకవర్గాల పరిధిలో ఉన్న కన్నూరుపాలెం-తోటకూరపాలెం తారు రోడ్డును రూ.కోటి 7 లక్షల నాబార్డు నిధులతో పునర్నిర్మించడానికి రామకృష్ణతో పాటు చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు పొన్నగంటి అప్పారావు, మాజీ ఎంపీపీ కుంద్రపు రామునాయుడు, కాయల మురళీధర్, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం

మాడుగుల రూరల్ : ఈ నెల 22వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కె.అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో వీరనారాయణం, ఎల్.పొన్నవోలు, కె.జె.పురం -1 , సచివాలయాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ప్రేమ సమాజానికి దుస్తుల వితరణ



ప్రేమ సమాజంలో పిల్లలకు దుస్తులు అందిస్తున్న సుబ్రహ్మణ్యం దంపతులు

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు, పిల్లలకు రూ.5 వేలు విలువ చేసే దుస్తులను తన కుమారుడి జన్మదినం సందర్భంగా రాంబిల్లి వీఆర్వో సుబ్రహ్మణ్యం దంపతులు ఆదివారం అందజేశారు. దాతకు ప్రేమ సమాజం కార్యదర్శి రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

వృథాగా పోతున్న తాగునీరు



హెడ్ జాయింట్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

అనకాపల్లి: మండలంలో తుమ్మపాల పంచాయతీ చిన్నబాబు కాలనీ, జిల్లా ఉద్యానశాఖ కార్యాలయం సమీపంలో వాటర్ హెడ్ పంప్ నుంచి నిత్యం వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోతున్నప్పటికీ పంచాయతీరాజ్ తాగునీటి విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా చోడవరం నుంచి అనకాపల్లికి నిత్యం వివిధ శాఖల అధికారులు రాకపోకలు సాగిస్తారు. తాగునీరు వృథాగా పోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు అన్ని రంగాలపై ఆసక్తి అవసరం



డ్రాయింగ్‌లో నైపుణ్యం ప్రదర్శిస్తున్న పిల్లలు

మునగపాక: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలపై కూడా ఆసక్తి చూపాలని 'మాఊళ్లో గ్రంథాలయం' ప్రోత్సాహకురాలు భీశెట్టి రామలక్ష్మి కోరారు. మండలంలోని మంగళవరపుపేటలో మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో పిల్లలకు సహ పాఠ్య ప్రణాళిక అంశాలు అభివృద్ధి సాధించేందుకు, చేతి నైపుణ్యం వృద్ధి చెందేందుకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. చదువులో క్రమ శిక్షణ, ఓర్పు, నైతిక విలువలు, భాషాభివృద్ధి చెందేందుకు ఏకాగ్రత అవసరమన్నారు. భగవద్గీతపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ భీశెట్టి తులసి, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు చదరం రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్ వేడుకలు



చందన ఊరేగింపులో ముస్లింలు

నక్కపల్లి: మండలంలోని పెదబొదిగల్లం, అప్పలపాయకరావుపేట, రామకృష్ణాపురం, చినబోదిగల్లం, పెద దొడ్డిగల్లు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మసీదులు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ పఠనం జరిగింది. కార్యక్రమాల్లో భాగంగా పలువురు మౌల్వీలు గ్యార్వీ షరీఫ్ ప్రాశస్త్యతను వివరించారు. గౌస్‌లాజమ్ జీవన విధానాన్ని తెలియజేశారు. ఆయన బోధనలను ఆచరించాలన్నారు. గ్యార్వీ షరీఫ్ వేడుకలను పురస్కరించుకొని గౌస్‌లాజమ్ జెండాను, చందనాన్ని ఊరేగించి, దర్గాల వద్ద ప్రతిష్ఠించారు. బంధువుల రాకతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో మసీదులు, దర్గాల వద్ద విందు భోజనం నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లింలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్ట హర చతుర్థి



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి చేనేత కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో ఆదివారం సంకష్ట హర చతుర్థి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉపమాక దేవస్థానం ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో వినాయకుడికి విశేష పూజలు చేశారు. కాలనీ వాసులతో పాటు బండారుపేట ప్రజలు ఈ పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బ్రిడ్జి శిథిలం.. ప్రాణభయం

- కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జికి మరమ్మతు చేయాలని ప్రజల వినతి
- బ్రిడ్జి సేఫ్టీగార్డులు శిథిలమై ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన



శిథిలావవస్థకు చేరుకున్న సేఫ్టీగార్డులు



విశాఖ-అనకాపల్లి జాతీయ రహదారిలో శిథిలావవస్థకు చేరుకున్న కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జి

అనకాపల్లి: కొప్పాక ఏలేరు కాలువకు సంబంధించి ఇరువైపులా బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుకున్నాయి. జాతీయ రహదారి, ఏలేరు కాలువ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎప్పుడేం జరుగుతుందోనని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే బ్రిడ్జికి మరమ్మతు చేసి వాహన చోదకులు, ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి..

సుమారు 23 సంవత్సరాల క్రితం విశాఖ నుంచి అనకాపల్లికి రాకపోకలు సాగించాలంటే ఒకే బ్రిడ్జి ఉండేది. జాతీయ రహదారి విస్తరణలో కొప్పాక రైల్వే ఫ్లైఓవర్ నిర్మిస్తున్న సమయంలో అనకాపల్లి నుంచి విశాఖకు ఒక బ్రిడ్జి, విశాఖ నుంచి అనకాపల్లికి మరో బ్రిడ్జి కొత్తగా నిర్మించారు. దీంతో కొప్పాక, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం, ఎన్టీఆర్ కాలనీ, వెంటరమణపేట తదితర ప్రాంతాల గ్రామీణ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అయితే రాత్రి సమయంలో గ్రామాల్లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు తీసుకొచ్చే సమయంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. విశాఖ నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జి నీరు రహదారి పైకి రావడంతో నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జికి ఇరువైపులా పెద్దపెద్ద గొతులతో వాహనాలు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు బ్రిడ్జి పడిపోయినట్లయితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు రెండు బ్రిడ్జిల మరమ్మతు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

బ్రిడ్జిలకు సేఫ్టీగార్డులు నిర్మించాలి..

రెండు బ్రిడ్జిల సేఫ్టీగార్డులు శిథిలావస్థకు చేరుకోవడంతో వాహన చోదకులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే సుమారు 100 మంది వరకు బ్రిడ్జిపై ప్రయాణించి క్షతగాత్రులుగా మిగిలిపోయారు. రహదారి శిథిలం కావడంతో వాహనాలు పాడై వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాలుగా వీటికి మరమ్మతు చేపట్టకపోవడంతో ఏ ప్రమాదం జరుగుతుందో అని అంతా ఆందోళన చెందుతున్నారు.

ద్విచక్ర వాహనం పాడైపోయింది..



వివిధ పనులపై అనకాపల్లి నుంచి విశాఖకు ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగిస్తున్నాను. జాతీయ రహదారి అంతా స్పీడ్ బ్రేకర్లతో ఉంటుంది. వారం రోజుల క్రితం విశాఖలో కుటుంబ సభ్యుల వివాహానికి వెళ్లి రాత్రి 9 గంటలకు అనకాపల్లి వస్తున్న సమయంలో కొప్పాక ఏలేరు కాలువ బ్రిడ్జిపై లైట్లు లేకపోవడంతో పెద్ద గోతిలో పడిపోయి వాహనం ముందు చక్రం విరిగిపోయింది. నేను, నా భార్య చిన్నపాటి దెబ్బలతో బయటపడ్డాం. వాహనానికి సుమారు రూ. 9 వేలు ఖర్చు అయింది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలి.

– కల్యాణ్, వాహనదారుడు, అనకాపల్లి

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మహేశ్వరరావు కుటుంబ సభ్యులు

మునగపాక: మునగపాకలో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలు అందజేస్తున్నారు. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.4 కోట్ల వ్యయంతో స్వామి ఆలయ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. మునగపాకకు చెందిన ఆడారి పోలి మహేశ్వరరావు ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ.25 వేల నగదు ఆదివారం అందజేశారు. కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, ఆడారి కాశీబాబు, మళ్ల రామజగన్నాథం, ఆడారి లక్ష్మణరావు, బొడ్డేడ రామునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా అవతార దినోత్సవం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో ఆదివారం భగవాన్ సత్యసాయిబాబా అవతార దినోత్సవం ఘనంగా జరిగింది. సత్యసాయిబాబా భక్తులు, బాల వికాస్ పిల్లలు సంకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సాయి నామ స్మరణతో తిమ్మరాజుపేట మార్మోగింది. తిమ్మరాజుపేట సత్యసాయి ట్రస్ట్ కన్వీనర్ సరిసా శివ, భజన మండలి కన్వీనర్ పెద రమణ, మళ్ల అప్పలనాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు జి.భీమవరంలో గ్రామ సభ

కశింకోట: మండలంలోని జి.భీమవరంలో సోమవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు తెలిపారు. భూముల సమస్యలుంటే వాటిని సభ దృష్టికి రైతులు తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.